క్లుప్తంగా

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని వెంకాయపల్లిలో వెలసిన ఎల్లమ్మకు భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం 5 గంటలకు ఆలయ పూజారులు అమ్మవారికి అభిషేకం, పంచామృతాభిషేకం, సుగంధద్రవ్యాల అభిషేకం, కుంకుమార్చన, పట్టువస్త్రాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని పెళ్లి పత్రికలను అమ్మవారి పాదాల వద్ద ఉంచి మొక్కుకున్నారు. నూతన వధూవరులు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

29న మండల సర్వసభ్య సమావేశం

పాణ్యం: పాణ్యంలో ఈనెల 29వ తేదీన ఎంపీపీ ఉసేన్‌బీ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్నం 3గంటల నుంచి సమావేశం జరుగుతుందని, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు. అధికారులు తమ అభివృద్ధి నివేదికను అందించాలన్నారు.

విద్యాశాఖలో లోపాలను సవరించాలి

కర్నూలు (న్యూటౌన్): ప్రస్తుతం విద్యాశాఖలో ఉన్న లోపాలను సవరించాలని ఆప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కర్నూలు మండలం గొందిపర్ల – వసంత నగర్‌లోని జెడ్పీ పాఠశాల మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు.

సద్వినియోగం చేసుకోండి



సి.బెళగల్- 2 సచివాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: గ్రామ సచివాలయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. ఆయన మంగళవారం ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి సి.బెళగల్- 2 గ్రామ సచివాలయంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు, పనితీరు, రికార్డులను పరిశీలించి లబ్ధిదారుల వివరాలను పంచాయతీ కార్యదర్శి కృష్ణప్రసాద్ నాయుడును అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సచివాలయంకు వచ్చిన మహిళలతో సమావేశమైన ఎంపీడీఓ సంక్షేమ పథకాలు, అభివృద్ధి అంశాలపై గ్రామ వలంటీర్లను సంప్రదించాలని, గ్రామస్తులు తరచుగా సచివాలయాలను సందర్శించి సమస్యలను ఉద్యోగుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

రిటైర్డ్ జవాను ఆకస్మిక మృతి

పాణ్యం: కొండజూటూరు గ్రామానికి చెందిన విశ్రాంత జవాను సద్దల రవికుమార్‌రెడ్డి (45) మంగళవారం గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గ్రామానికి చేరుకుని భౌతికకాయానికి నివాళులర్పించారు. రవికుమార్‌రెడ్డి బీఎస్‌ఎఫ్‌లో 20 ఏళ్ల పాటు దేశానికి సేవలదించారు. ఏడాదిన్నర క్రితమే వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉన్న సమయంలో గుండెపోటుతో మృత్యువాత పడ్డారు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేతో పాటు జెడ్పీటీసీ సద్దల సరళమ్మ, సద్దల సూర్యనారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, సర్పంచ్ సుజిత్‌రెడ్డి తదితరులు ఉన్నారు. మృతుడికి భార్య తులసి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

వివరాలు నమోదు చేయండి

పాణ్యం: ప్రభుత్వం కొత్తగా రూపొందిన లోకోస్ యాప్‌పై ఏపీఎంలు, సీసీలు, వీఓఏలకు శిక్షణ ఇచ్చామని, యాప్‌లో సంఘాల వివరాలు పక్కాగా నమోదు చేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. మంగళవారం పాణ్యం పొదుపు కార్యాలయంలో పొదుపు సంఘాల సీసీలు, వీఓఏలకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. యాప్‌లో పొదుపు సంఘాలకు సంబంధించి వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. ముఖ్యంగా జగనన్న తోడు, హౌసింగ్, లైవ్ స్టాక్ ప్రొగ్రెస్‌పై దృష్టి పెట్టాలన్నారు.వివరాల నమోదులో ఆలస్యం చేయరాదన్నారు. డీపీఎం ఐబీ దానం, ఏపీఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి ఆత్మహత్య

కోడుమూరు: అల్లినగరం గ్రామానికి చెందిన బాల మద్దిలేటి (43) అప్పులబాధతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలలు.. బాలమద్దిలేటి పొలాలను కౌలుకు తీసుకుని సాగుచేసేవాడు. పెట్టుబడులు, కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు సుమారు రూ.8 లక్షలు చేరాయి. అప్పులు తీర్చే మార్గం లేక గత శనివారం రాత్రి పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు బాలమద్దిలేటికి భార్య సుజాతతో పాటు, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- జాగ్రత్తలు తీసుకోకపోతే అనారోగ్యం తప్పదు
- శుభ్రత పాటించకపోతే ఇబ్బందే
- ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు డాక్టర్ మొల్లా జబీన్



అమ్మకానికి ఉంచిన పండ్లు

గడివేముల: పౌష్టికాహారం తగిన మోతాదులో తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. వేసవి కావడంతో ప్రతి ఒక్కరూ రోగ నిరోధక శక్తి పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రోజువారీగా పోషకాలతో కూడిన ఆహారం శరీరానికి అవసరమైన మోతాదులో తీసుకుంటే ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మొల్లా జబీన్ వివరించారు.

ఆహారపు అలవాట్లు

భోజనానికి ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. పోషకాలతో కూడిన ఆహారం, కాచి వడబోసిన నీటిని తీసుకోవడం ద్వారా వ్యాధుల భారిన పడకుండా ఉండొచ్చు. ఆహారాన్ని ఒకేసారి ఎక్కువగా గాకుండా కొంచెం కొంచెం మోతాదులో మూడు గంటలకోసారి తీసుకోవడం ఉత్తమం. వేసవి కాలం కావడంతో తాగునీరు అధికంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిల్వచేసిన ఆహారం, తీపి పదార్థాలు, కూల్‌డ్రింక్స్, ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన ఆహారపదార్థాలు తగ్గించాలి.

రోజువారీ ఆహారం ఇలా:

ఉదయం రెండు ఇడ్లీలు లేదా 60 గ్రాముల గింజ ధాన్యాలు లేదా 25 గ్రాముల పప్పులు, 150 మిల్లీ లీటర్ల పాలు తీసుకోవచ్చు. ఉదయం 11 గంటల సమయంలో ఎదో ఒక పండు లేదా నిమ్మరసం తీసుకోవాలి. ఇవేవీ లేకపోతే గ్లాసు పాలు తాగాలి. మధ్యాహ్నం భోజనంలో 75 గ్రాముల గింజధాన్యాలు, ఆకుకూరలు, పెరుగు ఉండేలా చూసుకోవాలి. సాయంత్రం 5 గంటలకు 50 గ్రాముల గింజధాన్యాలతో చిరుతిండి, ఒక కప్పు పాలు తీసుకోవాలి. రాత్రి భోజనంలో రెండుకప్పుల అన్నం లేదా రెండు చపాతీలు కూరగాయలతో తినాలి. కూరగాయ, పెరుగు వద్దనుకున్నప్పుడు 100 గ్రాముల మాంసాహారం ఉండాలి. పరిశుభ్రమైన నీరు తాగాలి. సరిపడా నీరు తాగితే 50 శాతం రుగ్మతలు దూరమవుతాయి. అలాగే రోజుకు 250 మిల్లీలీటర్ల పాలు తాగాలి. కాఫీ, టీ అలవాటు ఉన్నవారు రోజుకు ఒకటి రెండు సార్లకంటే ఎక్కువ తీసుకోరాదు.

పప్పు ధాన్యాలు:

ఆహారంలో పల్లీలు, మినుములు, శనగలు, బాదం పప్పు ధాన్యాలు వంటివి ఏదో ఒకటి ఉండేలా చూసుకోవాలి. ప్రతి రోజు ఏదో ఒక ఆకుకూర 100 గ్రాములు ఉండేలా చూసుకోవాలి. జామ, నిమ్మ, ఉసిరి ఏదో ఒక దానిని తప్పకుండా తీసుకోవాలి. రోజు ఒకటి ఉడికించిన గుడ్డు, వారంలో ఒకసారి చికెన్, మటన్ తీసుకోవాలి.

జలుబు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

జలుబు, దగ్గు, ఆయాసం వంటి సమస్యల నుంచి ఉపశమనం కోసం మిరియాలు, అల్లం, వెల్లుల్లి బాగా ఉపయోగపడతాయి. వీటిని అవసరం మేరకు వేడి నీరు, పాలు, టీలో ఏదేని ఒకదానిలో కలుపుకొని తాగితే దగ్గు నుంచి ఉపశమనం లభిస్తుంది.

ఏ విటమిన్‌తో శ్వాసకోస వ్యాధులకు చెక్



ఏ, డీ, ఈ, కె విటమిన్లు కలిగిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు. అంధత్వంతో పాటు పిల్లల్లో వాంతులు, విరేచనాలు, తట్టు, శ్వాసకోశ సంబంధ వ్యాధులను నివారించేందుకు ఏ విటమిన్ బాగా పనిచేస్తుంది. తోటకూర, మెంతికూర, పాలకూర, క్యారెట్, కెరోటిన్ ఉన్న మునగాకు, మామిడి, బొప్పాయి, మంచి గుమ్మడి వంటివి తీసుకోవడం వల్ల శరీరానికి సరిపడా విటమిన్లు అందుతాయి.

– డాక్టర్ ముల్లా జబీన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు, గడివేముల

క్రీడలతో మానసికోల్లాసం



పులకుర్తిలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కోడుమూరు: క్రీడలతో మానసికోల్లాసం, శారీరక వికాసం కలుగుతుందని కుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం పులకుర్తి గ్రామంలో వెలసిన సాయినాథుడి మహా రథోత్సవ వేడుకలను పురస్కరించుకుని గ్రామస్తులు ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు గ్రామీణ క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం సాయినాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.తర్వాత గ్రామంలోని హైస్కూల్ ఆవరణలో నాడు–నేడు నిధులు రూ.2.07 కోట్లతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను పరిశీలించారు. కాంట్రాక్టర్ శ్రీనాథ్‌రెడ్డితో మాట్లాడి పనుల వివరాలను తెలుసుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథరెడ్డి, సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, గ్రామపెద్దలు శ్రీనాథరెడ్డి, మాధవకృష్ణారెడ్డి, అక్కిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, సత్యారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, రమేష్‌నాయుడు, నాగేంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే మలేరియా దూరం





పోలకల్‌లో మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, గూడూరులో..

సి.బెళగల్: ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మలేరియాను నివారించవచ్చని సి.బెళగల్ పీహెచ్‌సీ వైద్యుడు మిథున్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం పురస్కరించుకుని వైద్య సిబ్బందితో కలిసి పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ.. జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మలేరియా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించి దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. అలాగే పోలకల్ గ్రామ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది గ్రామంలో ఉదయం విద్యార్థులతో మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

దోమతెరలు వాడాలి

గూడూరు: దోమల బారిన పడి మలేరియాకు గురికాకుండా ప్రజలు నిద్రించేటప్పుడు దోమ తెరలు వాడాలని హెల్త్ ఎడ్యుకేటర్ కృష్ణా రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలో వైద్య, నగర పంచాయతీ సిబ్బంది కలిసి ప్రపంచ మలేరియా వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, మెప్మా, వైద్య సిబ్బంది, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గడివేముల: పరిసరాల శుభ్రతతో దోమలను నివారించి మలేరియా రహిత సమాజాన్ని నిర్మిద్దామని గడివేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ తేజస్విని, జబీన్ తెలిపారు. గడివేముల పీహెచ్‌సీ నుంచి పాతబస్టాండు వరకు మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవంపై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్లు మాట్లాడుతూ.. దేశంలోనే రక్త నమూనాల సేకరణలో ఏపీ ముందుందన్నారు. అధిక రోజులు జ్వరం, తలనొప్పి అధికంగా ఉంటే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలన్నారు. మలేరియా నివారణ మందులు పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంపీహెచ్‌ఈఓ, ఏఎన్ఎం, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మలేరియాపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మూలపెద్దమ్మ ఆలయంలో భక్తుల సందడి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: మండల కేంద్రంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారి జాతర చివరి మంగళవారం కావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ వంటి విశేషపూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చైర్మన్ తలారిచిన్నన్న, ఈఓమోహన్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

గత నెల రోజులుగా జరిగిన మూలపెద్దమ్మ జాతర సందర్భంగా భక్తులు హుండీలో సమర్పించిన కానుకల లెక్కింపును బుధవారం నిర్వహించనున్నట్లు ఈఓ మోహన్ తెలిపారు. దేవస్థానం ఉన్నతాధికారుల పర్యవేక్షణలో లెక్కింపు కార్యక్రమం ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు.

అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలి

గడివేముల: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సస్పెన్షన్లను ఎత్తివేయాలని ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం గడిగరేవుల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై, నిరసన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సస్పెన్షన్ రద్దుచేసి, వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఈర్లదిన్నెలో భూ వివాదం



గాయపడిన అనిల్

సి.బెళగల్: మండల పరిధిలోని ఈర్లదిన్నె గ్రామంలో చోటు చేసుకున్న భూ వివాదంలో ఇరువర్గాల వారు ఘర్షణపడగా ఒక వ్యక్తికి రక్తగాయాలయ్యాయి. వివరాలు.. గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 355 లో 8.90 ఎకరాల పొలం ఉంది. ఈ భూమిలో కొంతభాగానికి సంబంధించి ఎస్సీ కాలనీలో నివాసమున్న అనిల్‌తో మద్దిలేటి, యువ రాజు, చిన్న గిడ్డన్న తదితరులకు మూడేళ్లుగా వివాదం నడుస్తోంది. కాగా సదరు భూమి సాగు విషయంలో మంగళవారం ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. ఘర్షణలో అనిల్ తలకు రక్తగాయం కావడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చిక్సిత పొందుతున్నాడు. ఘటనపై విచారించి కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ పీరయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాణ్యం: మండల కేంద్రంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు హైవే పెట్రోలింగ్ సిబ్బంది మంగళవారం తెలిపారు. వివరాలు.. కర్నూలు నుంచి నంద్యాలకు రెండు మృత దేహాలతో మహాప్రస్థానం వాహనం బయలుదేరింది. విజయానికేతన్ పాఠశాల వద్దకు రాగానే అరటిగెలల లోడ్‌తో పంక్చరై నిలబడిన మినీ ట్రక్కును ఢీకొట్టింది. ప్రమాదంలో మహాప్రస్థానం వాహనంలో కుర్చున్న లింగందిన్నెకు చెందిన లక్ష్మీ, రాజేశ్వరిలకు గాయాలు కావడంతో నంద్యాలకు తరలించారు. విషయం తెలుసుకున్న హైవే పెట్రోల్ సిబ్బంది రహదారిపై ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

బీజేపీ నుంచి దేశాన్ని కాపాడుకుందాం



ప్రచార భేరిలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాని గద్దె దింపి దేశాన్ని కాపాడుకుందామని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలో వివిధ గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రజలపై పన్నుల భారాలను మోపుతూ నిత్యవసర వస్తువుల ధరలు పెంచుతోందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరతూ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తోందని, కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తోందని మండిపడ్డారు. మండల కార్యదర్శి కె.మధు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి



నిడ్జూరులో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో రాష్ట్రంలో సాధించిన అభివృద్ధి, అమలుచేసిన సంక్షేమ పథకాలను చూసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కర్నూలు మండలం నిడ్జూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే స్థానిక సవారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు గ్రామ సర్పంచ్ మాధవి నుదుటన బొట్టు పెట్టి, హారతి పట్టారు. జేసీఎస్ మండల కన్వీనర్ సత్యంరెడ్డి, సచివాలయ కన్వీనర్ సంపత్‌కుమార్ పూలమాలలు వేసి స్వాగతం పలికారు. ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో గడప గడపకు వెళ్లిన ఎమ్మెల్యే ప్రజల యోగక్షేమాలు, వారి సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఏదైనా కారణం చేత పథకాలు అందని వారు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎక్కడ నెలకొన్న సమస్యలు అక్కడే పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కర్నూలు ఎంపీపీ ధర్మవరం వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ–2 నెహెమ్యా, జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, గిరిజోన్, సర్పంచ్ విద్యాసాగర్, సొసైటీ చైర్మన్ వంశీకృష్ణారెడ్డి, ఎంపీడీఓ భాస్కర్ నాయుడు, ఈఓఆర్డీ నాగేశ్వర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కూలి చెల్లించాలి

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన లొద్దిపల్లె గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి, కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాగన్న మాట్లాడుతూ.. జాబ్ కార్డు కల్గిన ప్రతి ఒక్కరికీ 200 పనిదినాలు కల్పించి, రోజుకు కనీస వేతనం రూ.600 అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి అలవెన్స్ 50 శాతం చెల్లించి కూలీలకు అండగా నిలవాలని కోరారు. గతంలో కనీసం రెండు వారాలకోసారి వేతనాలు వచ్చేవని, ప్రస్తుతం ఉపాధి పథకం కేంద్ర ప్రభుత్వ అధీనంలోకి వెళ్లాక, 8–10 వారాలైనా వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. పనిముట్ల నిర్వహణకు ఇచ్చే బిల్లులు, పని ప్రదేశంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచకపోవడంతో కూలీలు తీవ్ర అవస్థలకు గురవుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా డిమాండ్లు పరిష్కరించాలని లేని పక్షంలో ఉద్యమాలకు దిగుతామని హెచ్చరించారు. నాయకులు మహేష్, రామస్వామి, ఎఫ్ఏ నరేష్, మేట్లు, ఉపాధి కూలీలు ఉన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేద్దాం



ఎదురూరులో గ్రామ సభలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి గురుస్వామి

కర్నూలు (న్యూటౌన్): ఎదురూరు గ్రామాభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దామని పంచాయతీ కార్యదర్శి గురుస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం ఎదురూరు పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. అంతకుముందు మలేరియా దినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో తాగునీటి ఇబ్బందులు, డయేరియా వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి మూడు నెలలకోసారి గ్రామ సభ నిర్వహించి అభివృద్ధిపై సమీక్షిస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ మక్బూల్ బాషా, సూపర్ వైజర్ మద్దయ్య, ఏఎన్ఎం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సాయినాథుడి రథోత్సవం



పులకుర్తిలో సాయినాథుడి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: మండలంలోని పులకుర్తి గ్రామంలో మంగళవారం సాయినాథుడి మహా రథోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయినాథుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఆశీనులు చేసి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపట్టారు. గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పాల్గొని స్థానిక నాయకులు సత్యారెడ్డి, ఇమ్మానేయులు, లక్ష్మన్న, రాముడు, నారాయణతో కలసి సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గడప గడపకూ సంక్షేమ లబ్ధి



సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపకూ లబ్ధి చేకూరిందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు 27వ వార్డు 68, 69వ వార్డు సచివాలయాల పరిధిలోని కృష్ణానగర్, ఆదిత్య నగర్, అబ్బాస్ నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా కాలనీలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ సంక్షేమ క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కరోనా ప్రభావంతో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగాలేకున్న ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రజా సమస్యలను అక్కడిక్కడే పరిష్కారిస్తున్నామన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను ప్రజలు గమనించాలన్నారు. ఆయా కాలనీవాసులు డ్రైనేజీ, కల్వర్టుల సమస్యలను తెలియజేయగా సకాలంలో పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ మేయర్ రేణుక, స్థానిక కార్పొరేటర్ పల్లె శారద, పలువురు కార్పొరేటర్లు, నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సిద్దు, వెంకటరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కె.వి.రమణారెడ్డి, పెద్దన్న, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ



పాణ్యం పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

పాణ్యం: స్థానిక పోలీసు స్టేషన్‌ను నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసుల్లో విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని, నిర్దేశిత కాల పరిమితి లోగా కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. సమర్థవంతమైన ట్రైల్ ద్వారా నేరస్తులను శిక్ష పడేలా కృషి చేయాలని సూచించారు. అలాగే పీడీఎస్ రైస్, గుట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి పెట్టాలని, మిస్సింగ్ కేసుల్లో తక్షణమే స్పందించాలన్నారు. నాటుసారా, అక్రమ మద్యం అరికట్టాలని సూచించారు. ప్రజలతో మైత్రి భావం పెంచేలా నడుచుకోవాలన్నారు. సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామ సచివాలయం తనిఖీ

గూడూరు రూరల్: గుడిపాడు గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీఓ మాధవీలత తనిఖీ చేసి రిజిష్టర్లు, రికార్డులను పరిశీలించారు.ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రతి రోజు స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులకు పరిష్కారం చూపాలని సూచించారు.

కారు, బొలెరో ఢీ



ప్రమాదంలో బోల్తా పడ్డ కారు

కోడుమూరు రూరల్ : మండల పరిధిలోని ప్యాలకుర్తి గ్రామ సమీపంలో మంగళవారం కారు (ఏపీ 21బీజీ4455), బొలెరో (ఏపీ39డబ్ల్యూ4941) వాహనాలు ఎదురెదురై ఢీకొన్నాయి. అయితే, సకాలంలో ఎయిర్‌బెలూన్స్ తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. కాగా ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురు వ్యక్తులు, బొలెరో వాహనంలోని మరో వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులు వెంటనే చికిత్స నిమిత్త ప్రైవేట్ వాహనాల్లో కర్నూలుకు వెళ్లిపోవడంతో వారి వివరాల కోసం కోడుమూరు పోలీసులు ఆరా తీస్తున్నారు. కోడుమూరు సీఐ శ్రీధర్, ఎస్ఐ శ్రీనివాసులు ప్రమాద స్థలానికి చేరుకుని దెబ్బతిన్న వాహనాలను పరిశీలించారు.